# భ్రమర కీట న్యాయం

(క థా నిక)

చుట్టూ ఉన్న గ్రంథ సమూహాన్ని చూశాడొక్కసారి శేఖరం. అందులో ప్రాక్పశ్చిమాలలోవున్న ఉత్తమ రచయితల గ్రంథాలన్నీ ఉన్నాయి. శేఖరం దాదాపు అన్నీ చదివేశాడు. అవతల షేక్స్పియర్, షా, మొపాసా, మొదలయినవారూ; యివతల, చలం, కుటుంబరావు, గురజాడ, కృష్ణశాస్త్రి యిత్యాదులూ; ఏ క్షణాన్ని కావలిస్తే, ఆ క్షణాన్ని శేఖరానికి ప్రత్యక్షం కాగలరు.

ఇన్ని చదివినా శేఖరాన్ని మాత్రం 'షా' వ్రాసిన పిగ్మేలియన్ ఆకర్షించినంత యింకేదీ సాహిత్యంలో ఆకర్షించలేదు. అందుకు కారణం శేఖరానికి సహితం తెలియదు. అతను ఇప్పటికి యెన్నిసార్లు ఆ నాటకాన్ని చదివాడో అతనికే తెలియదు. "తగిన పరిస్థితులను కల్పించి, అవకాశాలిచ్చినట్లయితే యెంత తక్కువ వర్గంలో నుంచి వచ్చినవారినైనా ఉన్నత వర్గీయుల కన్నా ఉన్నతులను చేయవచ్చు" ననే షా వాదన శేఖరంలో ఆశయంగా జీర్ణించుకుపోయింది.

మరొక్కసారి "పిగ్మేలియన్" తీసి చదివాడు. యెన్నిసార్లు చదివినా యింకా చదవాలనే ఉన్నది అతనికి. ఇక్కడ మనకి శేఖరం వ్యక్తిగత జీవితానికి సంబంధించిన గాథ అక్కరలేదు. శేఖరం మాత్రం బాగా ఆస్తి ఉన్నవాడు. అలాగని అయిదారు సున్నాలని అందుకోలేదు అతని పైకం పుస్తకాలు చదవడం, నాట్యాలకీ నాటకాలకి వెళ్ళడం యిదీ అతని నిత్య కార్యక్రమం. అతను కళన్నా, సాహిత్యమన్నా, చెవి కోసుకుంటాడు. "మానవుడు నిత్యం పరిపూర్ణత్వం కోసం అన్వేషణ సాగించాలి" అనేది అతని సిద్ధాంతం. ఆ సిద్ధాంతాన్ని రూపంలో పెట్టడానికే అతను కృషి చేస్తున్నాడు.

* * *

శేఖరం నిత్యం కార్నివాల్ లోనూ, హోటల్స్‌లోనూ పరిభ్రమించే వ్యక్తి. అతన్ని యెరుగనివారు ఆ ఊరులో లేరని చెప్పవచ్చు. రాజకీయాలజోలికి యెన్నడూ పోయియెరుగడు.

ఒకనాడు ఒక హోటల్ లో ఒక పన్నెండేళ్ళ అమ్మాయిని చూశాడు. భగవంతుడిచ్చిన కిన్నెర కంఠంతో పాడుతోంది. ఆ అమ్మాయి స్వరంలో, ఏదో మధురతని చూడగలిగాడు శేఖరం. ఆ అమ్మాయి పాడుతోంది. "నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం వర్షిస్తుందా" అని శేఖరం చలితుడయ్యాడు. అంత చిన్న వయస్సులో ఆ అమ్మాయి అంత భావయుక్తంగా పాడగలుగుతోంది అంటే ఆమెలో 'షా' చెప్పిన కళలన్నీ మూర్తీభవించి, జీర్ణించుకుపోయి నట్లు శేఖరం కనుక్కున్నాడు. అతనిలో ఆశయం ఒక్కసారి పైకుబికింది.

పాట అయిపోయింది.

ఎవరికి తోచింది వారు యిస్తున్నారు.

శేఖరం వంతు వచ్చింది. చెయ్యి జాచింది.

"నీ పేరమ్మాయీ?"

"మాబోటి బీదవాళ్ళ పేర్లు ఏం బాగుంటాయి బాబూ!"

"సరేకాని యిదేనా నీ వృత్తి?"

"అవును బాబూ. హోటల్ లో పాడుకోవడం, ఆళ్ళిచ్చిన డబ్బులు కూడ దీసుకొని గంజినీళ్ళు తాగడం.

మరి మూడు నాలుగు సంవత్సరాల అనంతరం, ఆ అమ్మాయి యింకా యెలాంటి నీచ జీవితంలో అడుగుపెడుతుందో ఆలోచించాడు.

"యిదుగో చూడు. నువ్వు నాతో వచ్చేస్తావూ? నీకు కావలసిన తిండి బట్టా అన్నీ యిస్తాను. నీకు పాటలు నాట్యం, నటన అన్నీ నేర్పుతాను. రాగలవా?"

ఆ అమ్మాయికి ఆపదలో పెన్నిధి దొరికినట్లయింది. ఇంతకన్నా తనకి మంచి అవకాశం యెట్లా వొస్తుంది?

"తా రా మూ ర్తి"

"నాకు దేముడులా కనిపించారు బాబూ."
శేఖరం ఆమెని తీసుకొని వెళ్ళాడు.

* * *

"అలాంటి సమయంలో యెవరైనా యేం చేస్తారు? పోనీ మా అమ్మ ఉంటే బాగానే ఉండేది. కాని మా అమ్మ నేను మూడు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడే పోయింది. నాన్నగారే నన్ను యెనిమిదేళ్ళ వరకూ పెంచారు. యీ నాలుగు సంవత్సరాలూ ఇలాగే ఊరిమీద పెరిగాను." అంటార్కిటిక్ సముద్రం లోతు తెలుసుకున్నట్లయింది శేఖరానికి. ఆమె తొడుగుకున్న బట్టలు, యీనాటి సమాజ వ్యవస్థలాగే, కంపుకొండుతున్నాయి. "ఇదుగో నువ్వు యిక్కడే కూర్చో. నీకు మంచి బట్టలూ అన్నం తెస్తాను" అని శేఖరం వెళ్ళిపోయాడు.

ఆ అమ్మాయి ఆ గ్రంథాలన్నింటి వేపూ ఒక్కసారి చూచింది. "అబ్బ యిన్ని పుస్తకాలు చదివారా యీయన?" అనుకున్నది.

ఇంతలో శేఖరం వచ్చాడు.

ఆ అమ్మాయి తినేసింది.

శేఖరం "పిగ్మేలియన్" తీశాడు.

* * *

మరొకరయితే, అలాంటి అమ్మాయిని, తన క్రింద పెట్టి చాకరీ చేయించుకొందుకు ఉపయోగించుకొనేవారు. కాని శేఖరం మాత్రం అలా కాదు, "యీమెలో జీర్ణించుకుపోయిన కళని బయటకి ఎత్తాలి" అని నిశ్చయించుకున్నాడు. ఆ నిశ్చయంతోనే, తనలో ఉన్న ఆశయ సాధనకోసం, ఆమెకి మంచి బట్ట యిచ్చాడు. తిండి యిచ్చాడు. నెలకి ఎన్నో నాటకాలకి తీసుకొని వెళ్ళేవాడు. ఒకనాడు "నీకు నాట్యం అంటే ఇష్టమేనా?" అన్నాడు.

"నేర్చుకోవాలని చాలా సరదాగా ఉన్నది."

ఆ మర్నాటినుంచే, శేఖరం ఒక నాట్యాచార్యుని రప్పించాడు.

ఆ అమ్మాయి నాట్యం అతిశ్రద్ధతో నేర్చుకుంటోంది. నాట్యంలో వివిధ భంగిమలూ, నేర్చుకుంది. శేఖరం ఆమెను చూచి ఒకనాడు "యిటు చూడు. మనం ఏపని చేసినా, అంటే ఏ కళని ఆరాధించినా, అందులో పరిపూర్ణత్వం కోసం పోరాడాలి. అనాడే, కళకి నిజస్వరూపం ఏర్పడుతుంది" అన్నాడు. ఆ అమ్మాయి అందులో కొంత మాత్రమే గ్రహించగల్గింది.

"మనం, నూతిలో కప్పలలాగు మనం ఉన్నదే ప్రపంచం అనుకుని జీవించినంతకాలం, పరిపూర్ణత్వం రాదు. మనం పరిపూర్ణత్వంకోసం కొంతకాలం, చాలా దూరం పరిభ్రమించాలి."

అందుకని శేఖరం, కామాక్షిని తీసుకొని, దేశాటనకని బయలుదేరాడు. ఏ ప్రాంతీయులు ఎలాగ మాట్లాడుతారో, ఏ ప్రాంతీయులు ఎలాగ నడుస్తారో యివన్నీ చూపాడు. ఒక్కమాటలో చెప్పాలంటే శేఖరం, కామాక్షికి అవుసరమైన ప్రపంచ జ్ఞానాన్ని యిచ్చాడు.

యీనాడు కామాక్షి విజ్ఞానఖని. శేఖరం తాను చదువుకున్న పుస్తకాలలోని, సారస్వతమంతా ఆమెకి అందిచ్చాడు. కాని అభిప్రాయాల్లో మాత్రం శేఖరానికి, కామాక్షికి భేదం వచ్చింది. "పరిపూర్ణత్వం మానవుని అందుబాటులో లేదంటుంది" కామాక్షి. 'మానవునికి అతీతమయినది కాదు పరిపూర్ణత్వం' అంటాడు శేఖరం.

శేఖరం, కామాక్షి చేత, నాట్యం చేయించుదామనుకున్నాడు. అడిగాడు కామాక్షిని. "అలాగే" అన్నది.

* * *

కామాక్షి శేఖరాన్ని ఎంత గౌరవించాలో అంతగానే గౌరవించేది. శేఖరంకూడా కామాక్షిని అలాగే చూసేవాడు. కామాక్షి కనుకొలుకుల్లో నుంచి వచ్చే, ఏ పాట వెలుగునయినా ఉన్నతగా గౌరవించేవాడు. శేఖరంలో మాత్రం తాను 'పిగ్మేలియన్' పాత్ర వహించితీరాలన్న ఆశయం మాత్రం జీర్ణించుకుపోయింది. పిగ్మేలియన్ శిల్పి, రాతి ప్రతిమకి ప్రాణం పొయ్యగలిగాడు.

* * *

నాట్యం చేసి కామాక్షి లోనికి వెళ్ళిపోయింది. లోపల శేఖరం కూర్చున్నాడు. కామాక్షి ఆతురతగా వెళ్ళింది అతని దగ్గరకు. గోడ వైపు చూస్తున్నాడు అతను.

"ఎలాగున్నది? నా నాట్యం" అన్నది.

"బాగానే ఉన్నది" అన్నాడు శేఖరం.

ఆమె తిరిగి వేదిక మీదకు వెళ్ళిపోయింది.

నాట్యం నుండి నాటకాలకు మళ్ళించాడు కామాక్షిని. యీ సారి శకుంతలలో శకుంతలగా వేదిక నధిష్టించింది. ప్రేక్షకులు తన్మయులవుతున్నారు. కామాక్షి అత్యద్భుతంగా నటిస్తోంది. శేఖరం లోపలనుండి చూస్తున్నాడు. నాటకం అయిపోయింది. కామాక్షికి కావలసినది శేఖరం మన్నన. అందుకోసమే ఆమె చూస్తోంది. శేఖరం నోటంట "నువ్వు అద్భుతంగా నటించావు" అన్నమాట వింటే ఆమె జీవితంలో ఎంతో ఘనకార్యం సాధించినట్లు భావిస్తుంది.

"ఎలాగ నటించాను?"

"బాగానే ఉన్నది" ఆమె దెబ్బతిన్న లేడిలాగ చూసింది. ఆమె కనుగొలుకుల్లోంచి నీరు కారింది. శేఖరం చూశాడు.

"గులాబీ! ఎందుకు ఏడుపు"

"నా జీవితాన్ని నాశనం చేశావు"

"బాగుంది! సరే కాని దుష్యంతునితో మాట్లాడుతున్నప్పుడు ఎందుకంత తొందర?"

"ఏమయినా కానీ! దుష్యంతుడు నన్ను తెలియదని నటించి, తగిలేసిన రంగంలో నేనద్భుతంగా నటించాను. నా నటన ప్రేక్షకులను ఏడ్పించింది."

"కాని నీలో పరిపూర్ణత్వం రాలేదు" అన్నాడు శేఖరం.

*　　*　　*

కామాక్షి, ఏకాంతంగా ఆలోచిస్తోంది. ఆమెకి తెలుసు అంబరానికి అంతం కనుక్కోడానికి ప్రయత్నించడం ఎంత వెర్రో, పరిపూర్ణత్వంకోసం పరిభ్రమించడం అలాంటి వెర్రి కాగలదని.

ప్రపంచంలో మనకి యెవరైనా సన్నిహితులుంటే వారికోసం జీవించడానికి ప్రయత్నిస్తాం. శత్రువులుంటే వారిపైన కక్ష సాధించడానికి జీవిస్తాం. కాని ప్రపంచంలో సన్నిహితులూ, శత్రువులూ, లేకపోయినట్లయితే వారి జీవితం అదొకరీతిగా నిశ్చింతగా పోతుంది. కామాక్షి, హోటల్సులో పాడుకున్న రోజులలో శత్రువులు కాని, మిత్రులు కాని లేరు. కాని యీనాడు శేఖరం దగ్గరకి వచ్చినతర్వాత, ఆమెకి శేఖరం "పరిపూర్ణత్వం" అనే ఆశయాన్ని యిచ్చి ఆమె జీవితంలో శాంతిలేకుండా చేశాడు. శేఖరం ఆమెకి సన్నిహితుడు. "పరిపూర్ణత్వం" సంపాదించడం అనే శత్రువు ఆమెని నాశనం చేస్తోంది. తన శత్రువుకి శేఖరం మిత్రుడు. ఈ ఘర్షణ యెలా పరిష్కారమయ్యేది.

ఒక్కటే ఆలోచించింది. శేఖరం చెప్పిన పరిపూర్ణత్వాన్ని యెలాగూ తాను సంపాదించలేదు. అలాగని శేఖరంవంటి సన్నిహితుణ్ణి వదులుకోనూ లేదు. ఆమెకి ఆనాటి శకుంతల నాటకం అంతా జ్ఞాపకం వచ్చింది. ఆనాడు తాను యెంత బాగా నటించింది? ఆ నటనలో తనకి "పరిపూర్ణత్వం" లభించినదని ఆశించింది. కాని శేఖరం మాత్రం లేదన్నాడు. ఈ శత్రు మిత్రుత్వాల మధ్య తానెలాగ నలిగిపోతుంది?

"కామాక్షీ!" అన్న శేఖరం పిలుపు ఆమెని లేపింది.

"ఎల్లుండి నాటకం. ఆ నాటకానికి ప్రఖ్యాత నటీమణి "రాణి" వస్తోంది."

ఆ నాటకం జరిగిపోయింది.

కామాక్షి అత్యద్భుతంగా నటించింది.

"నువ్వు రూపొందిన సరస్వతి వమ్మా" అన్నది రాణి.

"బాగానే ఉన్నది" అన్నాడు శేఖరం.

"నీకు ఇంక బాగుండదు" అన్నది కామాక్షి.

"నీవు నటివి కాగలిగావు. కాని సంపూర్ణ పరిపూర్ణత్వాన్ని పొందలేదు."

*　　*　　*

"ఇదుగో యీయన జమీందారుగారు" అన్నాడు శేఖరం. "నమస్కారం" అన్నది.

చాలాసేపు సంభాషణ సాగింది. నక్షత్రాలు ఎందుకు రాలిపోవు? సూర్యచంద్రులు ఢీకొంటే ఏమైపోతుంది? ఇట్లాంటి అసందర్భాలుగురించి.

జమీందారు తనతో కామాక్షిని తీసుకొని వెళ్ళాడు. శేఖరం, కామాక్షికి ఉన్నతవర్గానికి చెందిన స్త్రీ జీవితం ఎలాగుంటుందో చెప్పాడు కాని ఉన్నత వర్గీయురాలుగా చెయ్యలేకపోయాడు. కాని జమీందారు ఆమెని అలాగు తయారు చెయ్యగలిగాడు. ఎలాగ మాట్లాడడమో ఎటువంటి నాట్యం చెయ్యాలో, ఉన్నత వర్గానికి సంబంధించిన రీతిగా చెప్పగలిగాడు.

కామాక్షికి చీకట్లో వెలుతురు కనిపించింది. "నువ్వు సాహిత్యానికే జీవాన్నిచ్చావు. నీలో పరిపూర్ణత్వం జీర్ణించుకుపోయింది" అన్నాడు జమీందారు.

ఈ మాటలు అతని హృదంతరోద్యానం నుండి వెలువడ్డాయి.

శేఖరం చాలా భయపడ్డాడు. ఈమె తన ప్రణయ కలాపాలని నాటకరంగంమీదే సాగిస్తుందేమోనని.

తను ఆశించిన పరిపూర్ణత్వం ఆమె తెచ్చుకో లేకపోయింది. తాను యెలాగు ఆమెని తయారు చేద్దామనుకున్నా, ఆమె "పరిపూర్ణత్వం మానవుల కసాధ్యం. ప్రేక్షకుడు రసపుష్టికోసం చూస్తాడు కాని, నటీనటుల పరిపూర్ణత్వం కోసం కాదు" అన్నది. శేఖరంలో ఉత్సాహం చచ్చింది. తన ఆశయాన్ని చంపుకున్నాడు. తాను అనుకున్న "పిగ్మేలియన్" పాత్రని పోషించ లేకపోయాడు.

ఒకనాడు శేఖరానికి పసుపు పెట్టిన కార్డు వచ్చింది. శేఖరం చిన్న నవ్వు నవ్వేడు. అది జమీందారుతో కామాక్షి వివాహంసూచిస్తూ, ఆహ్వానించిన కార్డు.

కొన్నాళ్ళ తర్వాత కామాక్షి జమీందారు గారితో వచ్చి "మమ్మల్ని దీవించండి" అన్నది. ఆమెను దీవిస్తూ "మనం ఏపని చేసినా పరిపూర్ణత్వం కోసం పరిభ్రమించాలి. అదే నీ జీవితలక్ష్యం చేసుకో" అన్నాడు.

"అలాగే. నా దృష్టిలో మానవుడికి పరిపూర్ణత్వం రాదు. కాని మీమీద గౌరవం కోసం నేను ఆ లక్ష్యానికి పాటుపడి, అది సాధించిననాడు వస్తాను" అన్నది కామాక్షి.

కామాక్షి ఎన్నడూ శేఖరం దగ్గరకు రాలేదు. అయినా శేఖరం యింకా "పరిపూర్ణత్వం మానవుల సొత్తు" అంటూనే ఉన్నాడు.

# కాలశక్తి

భాగి

దారిపోయే దండిగాలిని!
కాలుసాగిన కాలశక్తిని!
అడ్డలేరోయ్! నన్ను మీరు!
పట్టలేరోయ్! కట్టలేరోయ్!
పూలతోటలు వేసి పెంచితె
జీవమూల్యము చిమ్మిపోతా—
పెంటపోగులు పోగుపెట్టితె
జీవసంధులు ఊడగొడ్తా.
... ... ... ... ... ...
దారిపోయే గాలిగాణ్ణి
కాలుసాగిన కాలశక్తిని!
అడ్డలేర్ యే! నన్ను మీరు!
పట్టలేరోయ్! కట్టలేరోయ్!
బీదజనులా నోరుకొట్టి
స్వార్థపరులై కూడబెట్టిన
పసిడిముద్దల మంటరగిలి
ఇంటిచూరులు అంటుకోగా
ఊదిపోతా—
స్వార్థరహితుల జీవభారము
మోసుకొంటూ నీలిబాటల
తేలిపోతా—
దారిపోయే పాటగాణ్ణి!
కాలుసాగిన కాలశక్తిని!
అడ్డలేరోయ్! నన్ను మీరు!
పట్టలేరోయ్! కట్టలేరోయ్!
పాతబుర్రల నాటుకొన్నా
పూతపూయని గొడ్డు ఊసుల
వేళ్ళతోనే ఊడదీస్తా—
లేతగొంతుల తీగసాగే
కొత్తపాటల గాలిపోస్తా—
దారిపోయే దండిగాలిని!
కాలుసాగిన కాలశక్తిని!